ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

సంపుటి-1 సంచిక - 143 శనివారం 21 ఫిబ్రవరి 2026 పేజీలు -6 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati







## అంతర్జాతీయంగా చర్చకు దారితీయనున్న అమరావతి

# క్వాంటం వ్యాలీ




- కంప్యూటింగ్ పరకరాలకు క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన..
- డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా దృష్టి..
- స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి పారిశ్రామిక క్లస్టర్లు..
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం
- పలు సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్న ఎపి ప్రభుత్వం..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు.ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకు న్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు.

2లో







## లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు

# దుష్ప్రచారం

- లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు..
- నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని దుష్ప్రచారం..
- మండలిలో చర్చకు ఎందుకు వెనక్కి పోయారు..
- చంద్రబాబు లాగా షాస్ వేసుకుని ఫోటోలు పట్టుకోలే..
- కూటమి నేతల తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స ..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20:**

చంద్రబాబు దేవదేవుడి ప్రసాదంపై నిందా రోపణలు చేశారని.. లడ్డూలో జంతు వుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి దిగారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. (మిగతా 2లో)

# తగ్గను..తగ్గేదిలేదు




## బెంగాల్ సర్ ప్రక్రియ ప్రహసనం

# విమర్శలు దురదృష్టకరం

### సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన నిర్ణయం



**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 20 :**

ఓటర్ రోల్ క్లీన్-అప్ డ్రైవ్ విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరసర్ప నిందారోణపలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ పక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు శుక్రవారం నాడు సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల (మిగతా 2లో)

## భారత పౌరులకు వీసా సర్వీసుల

# పునరుద్ధరణ



**న్యూఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలలుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ (మిగతా 2లో)

## పంచాయతీలకు

# ఆర్థిక ఊరట



**15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి గ్రీన్ సిగ్నల్**
**జనవరి 5 తీర్మానాలకు అనుగుణంగా ఉత్తర్వులు...**
**సర్పంచ్‌లకు ప్రభుత్వం పెద్ద ఉపశమనం..**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు, వాటిని నడిపిస్తున్న సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆర్థిక ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా నిధుల లేమితో పనులు నిలిచిపోవడం, ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంచాయతీలకు ఇది పెద్ద ఉపశమనంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది గ్రామ పంచాయతీలు ఈ నిర్ణయంతో లాభపడనున్నాయి.గత ఏడాది గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో పంచాయతీలు నిధులను వినియోగించలేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే చేపట్టిన పనులకు చెల్లింపులు జరగక సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అయితే జనవరి 5న ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునేందుకు పంచాయతీలు తీర్మానాలు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలు తీర్మానాలు ఆమోదించాయి. తాజాగా ఆ తీర్మానాల ఆధారంగా నిధుల వినియోగానికి అనుమతిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఉత్తర్వుల ప్రకారం పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మెజర్‌మెంట్ పుస్తకాల్లో నమోదు చేసి, విధివిధానాలకు అనుగుణంగా బిల్లులు సమర్పిస్తే చెల్లింపులు చేయవచ్చని స్పష్టం చేసింది. దీంతో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు వేగవంతం కానున్నాయి. పంచాయతీల నుంచి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్లకు కూడా ఈ నిర్ణయం ఊరట కలిగించనుంది.ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులు మళ్లీ గాడిలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాగునీరు, రహదారులు, పారిశుధ్య పనులు వంటి ప్రాథమిక సదుపాయాలకు (మిగతా 2లో)

## హిందూపురంలో ఇంటి నిర్మాణానికి

# బాలయ్య భూమిపూజ



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

హిందూపురం శాసనసభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. శుక్రవారం సతీమణి వసుంధర దేవితో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ సొంతింటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. హిందూపురంలో హ్యాట్రిక్ విజయంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ ఇన్ని రోజులు ఇక్కడ అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలో ఓ ఇంటి వాడవు తున్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. నియోజకవర్గ పర్యటనకు హైదరాబాద్ నుంచి వచ్చి వెళుతుంటారు. అయినా నియోజకవర్గ ప్రజలు కానీ, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడు (మిగతా 2లో)

## అనంత ఆసుపత్రుల్లోని దుస్థితిపై అసెంబ్లీలో


# గళమెత్తిన పల్లె సింధూర



- పారిశుధ్య నిర్వహణలో తీవ్ర లోపాలు..
- సెక్యూరిటీ, చెదల నివారణ ఏజెన్సీల పనితీరుపై అసహనం..
- మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రూ.300 కోట్ల మంజూరు, ఇంకా పూర్తి కాని పనులు..
- ట్రామా, బర్న్స్ యూనిట్లలో సిబ్బంది కొరత..
- పరికరాల లేమితో చికిత్సలపై ప్రభావం..
- 2023లో పూర్తి కావాల్సిన నిర్మాణం ఇంకా పెండింగ్..
- 217 సీసీ కెమెరాల స్థానంలో 70 శాతం మాత్రమే ఏర్పాటు..
- అమర్చిన కెమెరాల్లో ఎక్కువ శాతం పనిచేయని పరిస్థితి..
- సంబంధిత మంత్రిని అసెంబ్లీలో కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర శాసనసభలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతిలో కొనసాగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్త రాల సమయంలో ఆమె ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆసుపత్రుల్లోపారిశధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, సెక్యూరిటీ వ్యవస్థలో లోపాలు ఉండటం, చెదల నివారణ పనులు సరిగా చేపట్టకపోవడం వల్ల రోగులు, వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు.మాతా శిశు సంరక్షణ కేంద్ర భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాలిన గాయాల చికిత్స కోసం ఏర్పాటు చేయాల్సిన బర్న్స్ యూనిట్, అత్యవసర సేవల కోసం ట్రామా కేర్ కేంద్రాల కు నిధులు మంజూరు అయినప్పటికీ (మిగతా 2లో)



## తిరుమల లడ్డూ కల్తీ కేసులో

# కొత్త మలుపు

**నెయ్యి కల్తీ వివాదంపై ప్రభుత్వం కీలక నిర్ణయం..**
**ఐఏఎస్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ..**
**సిట్ నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వం...**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

రాష్ట్రంలో నెల రోజులుగా తీవ్ర కలకలం రేపుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారం మరో కీలక మలుపు తీసుకుంది. ఇప్పటికే లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యి నాణ్యతపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరిపి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. అయితే ఆ సిట్ నివేదికలో పలు కీలక అంశాలు విస్మరించబడ్డాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏక సభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో దినేష్ కుమార్ ఒక్కరే సభ్యుడిగా ఉంటారు. లడ్డూ కల్తీ వివాదానికి సంబంధించిన ఆరోపణలు, సిట్ దర్యాప్తు నివేదికలో పొందుపరిచిన అంశాలు, విస్మరించబడ్డ విషయాలు, టీటీడీ బోర్డు వ్యవహరించిన తీరు, పరిపాలనా లోపాలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.లడ్డూ నాణ్యత విషయంలో వచ్చిన ఆరోపణలు భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా మారడంతో ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. నెయ్యి కొనుగోలు ప్రక్రియ, సరఫరాదారుల ఎంపిక, నాణ్యత పరీక్షల విధానం, ల్యాబ్ నివేదికలు వంటి అంశాలపై కూడా కమిటీ సమగ్రంగా విచారణ జరపనుంది. అవసరమైతే సంబంధిత అధికారులను, బాధ్యులను విచారణకు పిలిచి వివరాలు సేకరించే అధికారం కమిటీకి ఇవ్వబడినట్లు సమాచారం.సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనుంది. నివేదికలో లోపాలు ఉన్నాయా, దర్యాప్తు పరిమితమైందా, మరిన్ని కోణాలు పరిశీలించాల్సి ఉందా అనే విషయాలను కూడా (మిగతా 2లో)

తెలుగోడు

# అమరావతి క్వాంటం వ్యాలీ

(మొదటి పేజీ (తరువాయి)

సమీప భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఏకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో క్వాంటమ్ - ఏఐ రంగాల్లో నైపుణ్యాభి వృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది సర్కార్. ఏపీని క్వాంటమ్ - ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ - క్వాంటమ్ రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ - క్వాంటమ్ వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. క్వాంటమ్, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటమ్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ. ఏఐ - క్వాంటమ్ డిజిటల్ ఎంటసీగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

# లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుష్ప్రచారం

(మొదటి పేజీ (తరువాయి)

తన స్వలాభం కోసం తమ సంస్థలకు నెయ్యి టెండర్లు ఇప్పించుకోవడం కోసం అసత్యాలు చెప్పారన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టులో చాలా విషయాలు బయటికి వచ్చాయని.. హెరిటేజ్‌తో ఒప్పందం చేసుకున్న ఇందాపూర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. 2015-19 మధ్య కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారు. అవే ట్యాంకర్లను దాచి మళ్లీ వినియోగించారు. గోవిందా కూటమి నేతలకు ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. సభలో చర్చించాలని కోరామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సభలో టీడీపీ మంత్రులు అవాకులు, చవాకులు మాట్లాడారు. టీడీపీ నేతలకు కావాల్సింది స్వామివారి ఔన్నత్యం పెంచడం కాదు. కూటమి నేతలకు కావాల్సింది రాజకీయం. మీకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా చర్చకు రండి. చెప్పులు, బూట్లు వేసుకుని మేం దేవుడి ఫోటోలను పట్టుకుని ఉన్నట్లు నిరూపించండి. కెమెరాలు ఉన్నాయిగా మాకు వీలైతే ఆధారాలు చూపించండి. టీడీపీ నేతల వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. సభలో మేం ప్రదర్శించిన పేపర్లను నేనే స్వయంగా కలెక్ట్ చేసి టేబుల్ మీద పెట్టా. చంద్రబాబు లాగా మేం వేంకటేశ్వరస్వామి ఫోటోలను బూట్లు వేసుకుని పట్టుకోలేదు. వాళ్లలాగా మాది నీచబుద్ధి కాదు. దేవుడిని అవమానించారని ఊగిపోయిన జనసేన, బీజేపీ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు? చంద్రబాబు బూట్లు వేసుకుని దేవుడి ఫోటోను పట్టుకున్నది మీకు కనిపించడం లేదా?. మేం దేవుడి ఫోటోలను సభలో చెప్పులతో పట్టుకున్నట్లు నిరూపించండి. దేవుడి ఫోటోలను చించి, విసిరేశారని మాట్లాడుతున్నారు. మేం ఫోటోలను చించినట్లు రుజువు చేయండి. దేవుడిని రాజకీయాల్లోకి లాగింది చంద్రబాబు, పవన్, కూటమి నేతలు. దేనికి సభలో మంత్రులు ఊగిపోతున్నారని మండిపడ్డారు.

# విమర్శలు దురదృష్టకరం

(మొదటి పేజీ (తరువాయి)

సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ ప్రక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారంనాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. అయితే కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9వ తేదీ ఆదేశాలకు ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు. మేము మైక్రో అబ్జర్వర్లం కాదు. ఈ వ్యవహారం మాకు తీవ్ర అంసతృప్తిని కలిగిస్తోంది. రాష్ట్రాలు సహకరిస్తాయని మేము భావిస్తాం. మాకు ప్రైవేటు వివరణలు అవసరం లేదని సీజేఐ అన్నారు. ఎస్ఐఆర్‌పై జరుపుతున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇటీవల ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులతో సమావేశానంతరం బహిరంగంగానే ఆమె హెచ్చరికలు చేశారు. ఎన్నికల కమిషన్ ముందు లక్షలాది మంది బాధితులను పెరేడ్ చేయిస్తామన్నారు. మమతా బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఈసీ మండిపడింది. ఎన్నికల అధికారులు ఎంతో సంయమనంతో గౌరవంతో ఆమెతో మాట్లాడినట్టు తెలిపింది. అయితే బెంగాల్ ఓటర్ల జాబితా క్లీనప్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి మినహాయించారని మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో ఎందుకు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని తప్పుపట్టారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

**విశాఖపట్నం (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం చొక్కారపాలెం గ్రామానికి చెందిన బొల్లు పైడిరాజు మృతి చెందాడు. రొయ్య పిల్లలను తీసుకురావడం కోసం బొల్లు పైడిరాజు (35) సరకు రవాణా వాహనంలో కాకినాడ జిల్లా వేమవరం వెళ్లారు. అక్కడ సరకు ఎక్కించుకొని తిరుగుముఖం పట్టారు. శుక్రవారం వేకువజామున అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్ ప్లాజా సమీపంలో వాహన టైర్లలో గాలిని చెక్ చేయడానికి ఆపారు. వాహన చోదకుడు పైడిరాజు గాలిని చెక్ చేస్తుండగా వెనక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్సులో నక్కపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలో పైడిరాజు మృతి చెందాడు. మృతునికి భార్య, ఓ కుమార్తె,ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇకపోతే పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివారున కారు బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన బీరబోయిన వరప్రసాద్, భార్య సీతారత్నం దంపతులు మరో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో గురువారం అన్నవరంలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి వస్తుండగా శుక్రవారం ఉదయం జడ్డంగి శివారున కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సీతారత్నం (32) మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారు జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

# గోదావరి పుష్కరాలకు భారీగా ఏర్పాట్లు

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

అసెంబ్లీ సమావేశాలుఏడో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. గోదావరి పుష్కరాల సందర్భంగా నది కాలుష్యం జరగకుండా తీసుకునే చర్యలపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పుష్కరాల్లో నది పవిత్రతను కాపాడటం సహా కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని అన్నారు. డ్రెయిన్లతో పాటు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల నదికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాతో స్నాన ఘట్టాల సంఖ్యను పెంచామని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనలను కూడా పాటిస్తామని తెలిపారు. గోదావరి నది పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొన్ని చోట్ల జంతు కళేబరాలు, పౌల్ట్రీ వ్యర్థాలను నీటి



వనరుల్లో కలిపేస్తున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు.

# తగ్గను ..తగ్గేది లేదు

## జగన్‌ను కలసిన అనంతరం అంబటి ధాటిగా స్పందన

## తప్పుడు కేసులతో భయపెట్టలేరని స్పష్టం..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు బెయిల్‌పై విడుదలైన అనంతరం తాడేపల్లి క్యాంప్ కార్యాలయానికి చేరుకుని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్రమ కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఆయనకు గుంటూరు జిల్లా న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను జిల్లా సెషన్స్ న్యాయస్థానం కొట్టివేయడంతో ఆయనకు ఊరట లభించింది. ఈ సందర్భంగా తనపై నమోదు చేసిన కేసుల వివరాలు, వాటి రాజకీయ నేపథ్యాన్ని జగన్‌కు వివరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో ఉన్న సంకీర్ణ ప్రభుత్వం కక్షసాధింపుతో వ్యవహరిస్తోందని అంబటి పేర్కొన్నట్లు సమాచారం. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తన ఇంటిని ధ్వంసం చేయడం, హత్యాయత్నానికి పాల్పడడం, పోలీసులు సరైన రక్షణ కల్పించకపోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. తప్పుడు కేసులపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, చట్టపరంగా ధైర్యంగా ఎదుర్కొందామని జగన్ భరోసా ఇచ్చినట్లు సమాచారం. ప్రజల పక్షాన పోరాటం చేస్తూ ఎదురయ్యే వేధింపులను ధీటుగా ఎదుర్కోవాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జగన్‌ను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, లోక్‌సభ మాజీ సభ్యుడు నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఉన్నారు. జగన్‌ను కలిసిన అనంతరం అంబటి విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మూకలు తన ఇంటిపై దాడికి వచ్చినప్పుడు పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోవాలని సూచించారని ఆరోపించారు. కర్రలు, రాడ్లు పట్టుకుని తన కారుపై దాడి చేశారని, తీవ్ర పదజాలంతో దూషించారని తెలిపారు. ఆవేశంలో తాను కూడా స్పందించానని, మాట తూలిన విషయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పానని చెప్పారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడనని, రాజకీయంగా తగ్గేదే లేదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తానని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

## మానవ మేధస్సుకు సవాల్ విసిరేలా ఏఐ...ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

## హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం...ఏఐ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో సిఎం రేవంత్ రెడ్డి




**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# చెప్పులు, షూలతో వెళ్లారు చూడండి

## అయితే సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయండి

## వైసిపి ఎమ్మెల్సీలకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సవాల్

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

ఏపీ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వేంకటేశ్వరుడి ఫొటోలు, ప్లకార్డులతో నిరసనకు దిగడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెప్పులు, బూట్లతో దేవుడిని అవమానించారంటూ కూటమి సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో తాము సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫోటో, వీడియో చూపించినా ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానంటూ వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. ఈ ఛాలెంజ్‌పై వెంటనే స్పందించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి.. వైసీపీ సభ్యులు మండలిలో చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. ఎమ్మెల్సీగా రాజీనామా చేయాలని మాధవరావును మంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఫొటోలను.. ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి ఫొటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారని.. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారని విమర్శించారు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించిన తీరు.. మనసును కలచివేసేలా ఉందన్నారు. దేవుడి పట్ల భయం - భక్తి లేకుండా ప్రవర్తిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. పాలు లేకుండా నెయ్యి తయారు చేసిన తమ నాయకుడికి సన్మానం చేయాల్సింది పోయి.. నిందిస్తారా అంటూ వైసీపీ నేతలు మైండ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 5 కోట్ల మంది ప్రజలకు జగన్, వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పి తీరాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి డిమాండ్ చేశారు.

# బాలయ్య భూమి పూజ

(మొదటి పేజీ (తరువాయి)

హిందూపురం వచ్చిన అంతే ఉత్సాహంతో ఉంటున్నారు. ఇటీవల ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణపై సంచలన ఆరోపణ చేశారు. హైదరాబాదులో ఉండే బాలకృష్ణ, హిందూపురంలో పరిపాలిస్తున్నారంటూ విమర్శించారు. వారు చేసిన కామెంట్స్ హిందూపురంలో ప్రకంపనలు పుట్టించాయి. ప్రత్యర్థులకు హిందూపురంలో తాను స్థానికుడిని కాదు అని చేస్తున్న వ్యాఖ్యలకు.. అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. దీంతో హిందూపురం పట్టణంలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. హిందూపురం సమీపంలోని వన్నమ్మ కాలనీలో సర్వే నెంబర్ 445లో 81 సెంట్ల భూమిని ఎమ్మెల్యే బాలకృష్ణ కొనుగోలు చేశారు. ఆ స్థలంలో మూడంతస్తుల భవనంతో పాటు.. స్విమ్మింగ్ పూల్, ఆహ్లాదకరమైన ఉద్యానవనం, ఇతర సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. తమ అభిమాన నటుడు, హ్యాట్రిక్ విక్టరీ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్త ఇల్లు ఎలా ఉంటుందో అని హిందూపురంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# పంచాయతీలకు ఆర్థిక ఊరట

(మొదటి పేజీ (తరువాయి)

సంబంధించిన పనులు వేగవంతం కావడంతో గ్రామీణ ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య పంచాయతీ వ్యవస్థకు తాత్కాలిక ఉపశమనం ఇవ్వడమే కాకుండా గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా ఉందని భావిస్తున్నారు.

# వీసా సర్వీసుల పునరుద్ధరణ

(మొదటి పేజీ (తరువాయి)

అవసరమైన సిబ్బంది, పరికరాలు సమకూర్చకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదన్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి విభాగ నిర్మాణాన్ని 2023లోపు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అది ఇంకా పూర్తికాలేదని చెప్పారు. జాతీయ ఆరోగ్య కేంద్ర నియామకాల ప్రకారం ఆసుపత్రిలో 217 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా కేవలం 70 శాతం మాత్రమే అమర్చారని, వాటిలో కూడా దాదాపు 75 శాతం కెమెరాలు పనిచేయడం లేదని వెల్లడించారు. భద్రత పరంగా ఇది ఆందోళనకరమని అన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ కోసం పద్మావతి ఏజెన్సీకి, సెక్యూరిటీ కోసం ఈగల్ ఐ కంపెనీకి, చెదల నివారణ కోసం సాయి ఏజెన్సీకి కాంట్రాక్టులు ఇచ్చినప్పటికీ ఈ మూడు ఏజెన్సీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం లేదని ఆమె ఆరోపించారు. ఈ విషయాలను ఆరోగ్య శాఖ మంత్రికి అసెంబ్లీ వేదికగా వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు, విభాగాల ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పోలీస్ క్రీడలు ప్రారంభించిన హోం మంత్రి అనిత

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

# శ్రీవారి లడ్డూ కల్తీని కప్పిపుచ్చే యత్నం

## మండలిలో వైసిపి సభ్యుల సిగ్గుమాలిన చర్య

## తిరుమలేశుడి ఫోటోలతో డ్రామాలు దుర్మార్గం

## మండిపడ్డ తెలుగుదేశం ఎంపిలు

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**

శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంలో శాసనమండలిలో వైసీపీ నేతలు వేంకటేశ్వర స్వామి ఫొటోతో శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ విషయంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై తెలుగుదేశం ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు పట్టుకుని రాజకీయం చేస్తారా అని ధ్వజమెత్తారు. శాసనమండలిలో వైసీపీ తీరు సిగ్గు సిగ్గు అని ఎద్దేవా చేశారు. 'శ్రీవారి పవిత్ర లడ్డూలో కల్తీ జరిగిందని మాజీ టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే.. కల్తీ జరగలేదని వైసీపీ నేతలు కంత్రి వేషాలు వేస్తున్నారని దెప్పిపొడిచారు. క్రీడా స్ఫూర్తి చాటే లోకేశ్‌తో.. ప్యాలెస్‌లో పబ్జీ గేమ్ ఆడుకునే జగన్ రెడ్డికి పోలికా?' అని అప్పలనాయుడు సెటైర్లు గుప్పించారు. శాసనమండలిలో వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరును సభ్య సమాజం వ్యతిరేకిస్తోందని టీడీపీ ఎంపీ సానా సతీశ్ పేర్కొన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు వేసుకుని ప్రదర్శిస్తున్న తీరు వైసీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందని విమర్శించారు. జగన్ ఆనందం కోసమే ఆ పార్టీనేతలు ఇలా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు చేస్తూ వైసీపీ నేతలు కూడా పాపాలూ చేసే పరిస్థితి కొని తెచ్చుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎవరు చెప్పులు వేసుకుని రాలేదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని ఎంపీ సతీశ్ విమర్శించారు. సభ్య సమాజమంతా వైసీపీకి బుద్ధి చెప్పే సమయం వస్తుందని సానా సతీశ్ హెచ్చరించారు. లోకేశ్ క్రికెట్ చూడటానికి వెళ్తే జగన్‌కు వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు. లోకేశ్‌ను చూసి జగన్ రెడ్డికి జలసీ, కుళ్లు అని ఎద్దేవా చేశారు. జగన్ ఎక్కడికైనా వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకుని వెళ్లాలని విమర్శించారు. టీవీలో క్రికెట్ చూడాలని జగన్‌కు రాసిపెట్టి ఉందని.. ఆయన నేరస్థుడు కాబట్టి బయటకు వెళ్లి క్రికెట్ చూడలేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఇతర దేశాళకు వెళ్లాలంటే జగన్ రెడ్డి న్యాయస్థానం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. టీటీడీ లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి హెరిటేజ్‌కు ముడిపెట్టారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోను దేవుడు శిక్షిస్తారని.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 మంది సభ్యులు కూడా మిగలరని సానా సతీశ్ సెటైర్లు వేశారు. శ్రీవారి కల్తీ లడ్డూ వ్యవహారంపై టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పన్న ఎవరి పీఏనో అందరికీ తెలుసని, ఆయనకు సహాయం చేయమని జగన్‌మోహన్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి గతంలో తనకు చెప్పారని అన్నారు. సహాయం చేసినందుకు ఆ నింద తనపై పడిందన్నారు. అప్పన్న ఎవరి పీఏనో దేశమంతా తెలుసునని ఎంపీ పేర్కొన్నారు.

## దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి



కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : దొంగతనాల పట్ల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ రెడ్డి సూచించారు.శుక్రవారంనాడు ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్, ఇళ్ల దొంగతనాలు మరియు వాహనాల దొంగతనాలు జరుగుతున్నట్లు గమనించబడిందని, ముఖ్యంగా సాయంత్రం మరియు రాత్రి వేళల్లో మహిళలను టార్గెట్ చేస్తూ బైక్‌లపై వచ్చి బంగారు గొలుసులు లాక్కెళ్లే ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇటీవల పత్తికొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద మహిళా మెడలోని బంగారు గొలుసు దొంగతనం జరిగిందన్నారు. అలాగే దేవనకొండ టీకా గళం ప్రాంతంలో చైన్ స్నాచింగ్ ఘటన నమోదైంది. గోనెగండ్ల అంగడి ప్రాంతంలో మహిళా మెడలోని బంగారు గొలుసు దొంగతనం జరిగిందన్నారు.ఆదోని ప్రాంతంలో కూడా మహిళలపై చైన్ స్నాచింగ్ ఘటనలు నమోదయ్యాయన్నారు.

అందువల్ల ప్రతి ఒక్కరూ క్రింది సూచనలు తప్పనిసరిగా పాటించగలరని తెలిపారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ఎక్కువగా ధరించవద్దని వాకింగ్‌కు వెళ్లేటప్పుడు ముఖ్యంగా 40 నుండి 60 సంవత్సరాల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఊరి చివర ఉన్న ఇళ్లలో నివసించే ఒంటరి మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పదంగా వెనుకనుంచి వస్తున్న బైక్‌లను గమనించండని సూచించారు..ప్రమాదం అనిపించిన వెంటనే గట్టిగా అరవండి మరియు సమీప వ్యక్తుల సహాయం కోరండని తెలిపారు. రాత్రి సమయంలో ఇళ్ల తలుపులు, కిటికీలు బిగిగా మూసివేయాలని తెలిపారు.ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు వేసి వెళ్లాలన్నారు.

ఎక్కువ రోజులు బయటకు వెళ్తే సమీప పొరుగువారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. వీలైతే సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఇంటి వద్ద లైటింగ్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు.

బైక్ ,వాహనాలను రోడ్డుపై వదిలిపెట్టకుండా సురక్షిత ప్రదేశంలో పార్క్ చేయాలని స్టీరింగ్ లాక్ లేదా డిస్క్ లాక్ తప్పనిసరిగా వాడాలన్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని బంగారం పాలిష్ చేస్తాం అని చెప్పే వ్యక్తులను నమ్మవద్దుఅని అన్నారు. బ్యాంక్ అధికారులమని,పోలీసులమని చెప్పి ఓటిపి అడిగితే ఇవ్వవద్దుఅన్నారు.మీ కుటుంబ సభ్యుడు ప్రమాదంలో ఉన్నాడు అని చెప్పి డబ్బులు అడిగితే వెంటనే నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు.. అత్యవసర సహాయం కోసం వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని,.సైబర్ మోసాల ఫిర్యాదులకు 1930 కు సంప్రదించేయాలన్నారు. ప్రజల సహకారం లేకుండా నేరాలను అరికట్టడం సాధ్యం కాదని, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, వాహన నంబర్లు గమనించి వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. మీ సహకారమే మా బలంమని భద్రమైన కోసిగి మనందరి లక్ష్యం.అన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ యూనైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్

## అవినీతికి పాల్పడిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 20 : అవినీతికి పాల్పడ కౌతాళం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ ఏ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ , ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, ఆర్ యు ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని హెచ్‌ఎం ఆసరాగా చేసుకుని పాఠశాలలో ఉన్న బియ్యాన్ని సెలవు రోజుల్లో బ్లాక్ మార్కెట్‌కి తరలించడం దారుణమన్నారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే మంచి దృష్టితో విద్యార్థులకు ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందన్నారు. అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసులకు కక్కుర్తి పడి విద్యార్థుల నోటి దగ్గర దూడు లాక్కోవాలని చూడడం విచారకరమన్నారు. బియ్యం అక్రమంగా తరలిస్తుంటే విద్యార్థి సంఘాలు అడ్డుకున్నాయన్నారు. దీనిపై విచారణకు వచ్చిన ఎంఈఓ-2 హెచ్‌ఎంకి వత్తాసు పలికడం విచారకరమన్నారు. నిలదీస్తే కల్లబొల్లి మాటలు చెప్పి సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. హెచ్‌ఎం గతంలో మూడు నాలుగు వందల మంది విద్యార్థులకు చాలీచాలని అన్నం పెట్టారని, మరికొంత మందిని పస్తులు పెట్టారన్నారు. ఇకనైనా విద్యాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి బియ్యం తరలింపు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు



హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్‌కు కలిసిన బిజెపి నాయకులు

## హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్‌కు ఘన సన్మానం

### బిజెపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : లేపాక్షి శ్రీవీరభద్రేశ్వర స్వామి ఆలయాన్నిహైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రసిద్ధి చెందిన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయం వద్ద రోళ్ళ మండలం కొత్త తిరుపతి ఆలయ ధర్మకం గోవిందరాజులు , బిజెపి రాష్ట్ర నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్, న్యాయవాది సురేష్ రాజ్, మడకశిర వార్త ఆర్ సి ఇంచార్జ్ గంగాధర్, వెంకటేష్,బద్రి నాగేంద్ర స్థానిక బిజెపి నాయకులు ఆలయ కమిటీ సభ్యులు. మర్యాద పూర్వకంగా కలసి బొకే తో స్వాగతం పలికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.అనంతరం శ్రీ సజ్జనార్ స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు సజ్జనార్ ను ఘనంగా సన్మానించారు.



లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ దంపతులు . సన్మానించిన బిజెపి నాయకులు

## రైల్వే పోలీసులకు చుక్కలు చూపించిన చైన్స్ స్నాచర్!

### పయాణికురాలి మెడలోని బంగారు గొలుసు కాక్కుని పరారీ.. వెంబడించిన రైల్వే పోలీసులు.. పోలీసులపై రాళ్లతో దాడి.. తెల్లవారుజాము వరకు గాలింపు.. గుత్తి రైల్వేస్టేషన్‌లో రాత్రి జరిగిన ఘటన..




గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని గుత్తి రైల్వే పోలీసులకు గురువారం రాత్రి ఓ చైన్స్ స్నాచర్ చుక్కలు చూపించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి బెంగళూరు - కాచిగూడ ట్రైన్ నెంబర్ 12786 ఎక్స్‌ప్రెస్ రైలులో అనంతపురం నగరానికి చెందిన అరుణ కాచిగూడకు బయలుదేరింది. ఈ సందర్భంగా ఆమె రైలు బోగీలోని కిటికీ వద్ద కూర్చొంది. అది గమనించిన చైన్స్ స్నాచర్ ఒకడు అనంతపురం నుండి ఆమెను గమనిస్తూ వస్తూనే ఉన్నాడు. రైలు గుత్తి రైల్వే స్టేషన్ రెండో నెంబర్ ప్లాట్ ఫామ్‌లో నిలబడగానే ఆ యువకుడు రైలు దిగుతున్నట్లు నటించి కిటికీ వద్దకు వెళ్లి అరుణ మెడలోని ఖరీదైన బంగారు నగ లాక్కున్నాడు. అది గమనించిన ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న కొందరు ఆ యువకుడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. యువకుడు బలవంతంగా లాగడంతో ఆమె మెడలోని బంగారు చైన్ తెగిపోయి కొంత భాగం యువకుడు చేతిలోకి మరికొంత అక్కడే పడిపోయింది. ఆమె కేకలను గమనించిన స్థానికులు అక్కడే విధి నిర్వహణలో ఉన్న జిఆర్‌పి, ఆర్పీఎఫ్ పోలీసులు అతని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఆ యువకుడు అత్యంత వేగంగా అక్కడి నుండి పరుగులు తీశాడు. ఆర్ వో హెచ్ డి ఏరియా నుండి గుత్తి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. అతని పట్టుకోవడానికి గురువారం రాత్రి పెద్ద సంఖ్యలో ఆర్పీఎఫ్ పోలీసులు , జిఆర్పి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు రాకను గమనించిన అ యువకుడు పట్టుబడతానన్న భయంతో పోలీసులపై తిరగబడి కంకర రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులకు చైన్ స్నాచర్ దొరికినట్లు దొరికి తప్పించుకున్నట్లయి తెలిసింది. గురువారం రాత్రి 11 గంటలకు చోరీ జరగగా చోరీకి పాల్పడ్డ యువకుని పట్టుకోవడానికి పోలీసులు విఫలయత్నం చేశారు. అరుణ తాను పోగొట్టుకున్న బంగారు నగపై కర్నూలు జి ఆర్ పి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది..

కాగా రైల్వే స్టేషన్ సమీపంలోని చెట్నిపల్లి గ్రామంలోనూ ఆ యువకుడు హల్‌చల్ చేసినట్లు తెలుస్తోంది. గ్రామ శివారులోని ఓ ఇంటి వద్ద తచ్చాడుతుండగా మహిళ పెద్ద ఎత్తున కేకలు వేయడంతో అక్కడి నుండి పరుగులు పెడుతూ ఆ యువకుడు గ్రామ సమీపంలోనే రామాలయం వీధి వద్దకు వెళ్ళినట్లు తెలుస్తోంది. అక్కడ కొందరు మహిళలు గట్టిగా కేకలు వేయటంతో అక్కడి నుండి తప్పించుకొని పారిపోయాడు. చివరకు అదే యువకుడు బెంగళూరు నుండి కాచిగూడకి వెళ్తున్న రైల్లో చోరీకి యత్నించడం పెద్ద ఎత్తున దూమారం లేపింది. అర్ధరాత్రి నుండి తెల్లవారుజామున ఆరు గంటల వరకు చైన్ స్నాచర్ పోలీసులను ముప్పు తిప్పలు పెట్టినట్లు తెలుస్తోంది.

## మోడల్ స్కూల్ సమీపంలో గుడిసెలు తొలగింపు

### గుడిసెలు వేసుకున్న దళితులు.. తొలగించిన రెవెన్యూ అధికారులు..

గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో గత మూడు రోజుల క్రితం గుత్తి పట్టణం మరియు సమీపంలోని కోళ్ల ఫారంలో నివాసం ఉండే దళితులు గుడిసెలు వేసుకున్నారు. ప్రభుత్వ అధికారులు తమకు పది సంవత్సరాలుగా ఇండ్లపట్టాలి ఇవ్వటం లేదని దీంతో తాము ఇళ్లలో నివాసం ఉండాల్సి వస్తుందని రోజు కూలీలుగా బతుకుతున్న తాము ఇళ్లకు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎల్లమ్మ ,ముత్యాలపాల ఆధ్వర్యంలో 50 మంది పేదలు మోడల్ స్కూల్ సమీపంలోని గుట్టపైన గల ఆరుబయట స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేస్తున్నారు. రెవిన్యూ అధికారులు పరిశీలించి తమకు ఇళ్ళ పట్టాలి ఇవ్వాలని వాళ్ళ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే గురువారం రెవెన్యూ అధికారులు వచ్చి తమ్ముడు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను బలవంతంగా తొలగించారన్నారు. అధికారులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కోట్ల విలువ చేస్తే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతంఅవుతుండగా వాటిని పరిరక్షించలేని రెవెన్యూ అధికారులు తమ గుడిసెలను బలవంతంగా తొలగించడంలో ఎంతవరకు న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడు నిరుపేదలమైన తమపై రెవెన్యూ అధికారులు నియోజకవర్గం ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ లు దయతో తమ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నాడు



గుడిసెలు వేసుకున్న దళిత మహిళలు



గుడిసెలను తొలగించిన రెవెన్యూ అధికారులు

## చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల టెంకాయల వేలం పాట

యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : యాడికి మండల కేంద్రంలోని వేసిన శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. రూ.2,41,116కు పాట పాడి నాగేంద్ర దక్కించుకున్నారు. శుక్రవారం చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలో దేవదాయ శాఖ అధికారి దుర్గాప్రసాద్. ఆలయ కమిటీ సభ్యుడు గ్రామ పెద్దలు భక్తులు ప్రజల సమక్షంలో ఈ నెల 24వ తేదీ నుండి మార్చి 10వ తేదీ వరకు శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా టెంకాయల వేలంపాట నిర్వహించగా రూ. 5, 000 డిపాజిట్ చెల్లించి సభ్యులు పోటీలో పాల్గొన్నారు. నాగేంద్ర రూ. 2,41,116కు పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం రూ. 2,40,116కు పాడారు. ఈ సంవత్సరం 2.41.116 పాట పాడి దక్కించుకున్నారు గత సంవత్సరాలకి ఈ సంవత్సరానికి ?1000 ఆదాయం అధికంగా వచ్చింది . అయితే ఈనెల 24 తేదీ నుండి మార్చి 10వ తేదీ వరకు గ్రామంలో ఎవరు టెంకాయలు అమ్మరాదని కేవలం టెంకాయ వేలం పాట పాడి దక్కించుకున్న వారు మాత్రమే టెంకాయలు అమ్మాలని, మిగతావారు ఎవరైనా అమ్మితే చర్యలు తప్పవని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో దుర్గాప్రసాద్. ఏఎస్ఐ వెంకటేష్ , ఆలయ కమిటీ సభ్యులు రూపులేని రాజశేఖర్ జానపాటి రాజు. రంగయ్య రామ్మూర్తి. నీలకంఠ బంగారు బాలయ్య, ఆదినారాయణ, చిదంబరం. కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారి దుర్గాప్రసాద్



వేలం పాటలో పాల్గొన్న ప్రజలు



నాటు సారా ఊట ధ్వంసం చేస్తున్న గుత్తి పోలీసులు

## బసినేపల్లి తండాలో నాటు సారా ఊట ధ్వంసం

గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : గుత్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బసినేపల్లి తండాలో శుక్రవారం గుత్తి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. గుత్తి ఎస్సై అమీర్ ఖాన్ తన సిబ్బందితో కలిసి బసినేపల్లి తండా లోగల గుట్టలో పర్యటించారు. ఈ సందర్భంగా నాటు సారా స్థావరాన్ని గుర్తించి సారా ఊటను ధ్వంసం చేశారు.



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న నేతలు

## సీయం సహాయనిధి చెక్కు పంపిణీ

రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 20 : సీఎం సహాయ నిధి చెక్కును టిడిపి మాజీ మండల జడ్పీటీసీ సభ్యుడు మునస్వామి లబ్దిదారునికి పంపిణీ చేశారు. శుక్రవారం పెద్ద కురుబన పల్లి గ్రామానికి చెందిన సువర్ణ కు1,25 లక్ష రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులలో చికిత్సలు పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి తక్షణ సహాయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్ , జిల్లా నేత జయశంకర్, నాగభూషణం, శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఒంటరి ఏనుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

### అటవీ అధికారుల సూచన..

రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 20 : రామకుప్పం మండల అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి జీడిమాకులపల్లి గ్రామ పరిసరాల్లోకి ఒంటరి ఏనుగు సంచరిస్తూందని అటవీ సిబ్బంది డ్రైవ్ చేయడం తో అది మొసలిమడుగు ప్రాంతంకు చేరుకుందన్నారు. శుక్రవారం రాత్రికి జీడిమాకులపల్లి, కోట చేను, పాలరేవు గడ్డ, లక్ష్మీపురం, ఏ గుట్ట గ్రామాల వైపు వచ్చే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు తెలిపారు .రాత్రిపూట రైతులు తమ పంట పొలాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఒంటరి ఏనుగు ఎక్కడైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 8919668651, 6301667521 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

## సంకల్ప కళా గ్రామంలో ఫ్లీట్ రివ్యూ

యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 20 : భారతీయ నౌక దళం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫ్లీట్రివ్యూలో భాగంగా శుక్రవారం సంకల్పకళ గ్రామంలో సహజరంగుల అద్దకం మీద కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 దేశాలకు సంబంధించిన సుమారు వందమంది పాల్గొన్నారు. నేవీ వెల్ఫేర్ అండ్ వెల్నెస్ అసోసియేషన్ ఈస్ట్ న్ రీజియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## క్రమశిక్షణతో చదివిన ప్రతి విద్యార్థి ఒక మేధావి




విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులు ప్రధానం చేస్తున్న ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా,

కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 20 : క్రమశిక్షణతో చదివిన ప్రతి విద్యార్థి ఒక మేధావి అని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, ఉపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి అన్నారు . కౌతాళం మండలం కేంద్రంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులందరూ గొప్ప వారి కానీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రమశిక్షణ నైతిక విలువలతో చదివితేనే ఉన్నత స్థానానికి చేరుకోగలరని తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న విజ్ఞానం పరంగా సెల్ ఫోన్ లకు ఆకర్షితులై చెడు మార్గాలలో వెళ్లడం మనం పత్రికలలో టీవీలలో చూస్తున్నాం. కాబట్టి ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను దృష్టిలో పెట్టుకొని చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు, దూరంగా ఉండి విద్యనభ్యసించినప్పుడే మేధావులం కాగలమని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చగలమని సూచించారు. అనంతరం క్రమశిక్షణతో చదివిన విద్యార్థినీ విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులను ప్రధానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి నృత్య కళాకారుడు రాజ్ కుమార్ చేపించినటువంటి వెంకటేశ్వర స్వామి కి సంబంధించిన వెంకటేశ్వర స్వామి సుప్రభాతం పాటకు నృత్యం చాలా చక్కగా చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించిన కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా




నృత్యం చేస్తున్న విద్యార్థులు

# వైభవంగా శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** మండల పరిధిలో హేమావతి లో వెలిసిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం. శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి రథోత్వవాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కరే గౌడ, రాష్ట్ర వక్కలిగా కుంచుటిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి, మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, జయ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు రత్తమ్మ నరసింహమూర్తి ప్రారంభించారు., ఆలయ అర్చకులు శివరాత్రి పండుగ పురస్కరించుకొని శ్రీ సిద్దేశ్వర స్వామి మూల విరాట్కు రుద్రాభిషేకం, అభిషేకం, పంచామృత అభిషేకం వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, సతీమణి ఉమాదేవి విశేష పూజలు చేయించి స్వామి వారి ఆశీర్వాదం పొందారు. శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ దొడ్డేశ్వర స్వామి, శ్రీ మల్లేశ్వర స్వామి, శ్రీ విరూపాక్షేశ్వర స్వామి, అక్క చెల్లెళ్ల దేవాలయాలలో కూడా పూజలు నిర్వహించారు. అగ్నిగుండం నందు ధూపం వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ ఓంకార స్వామి, రామచంద్రప్ప, శ్రీ సిద్దేశ్వర స్వామి ఉత్సవమూర్తిని మేళ తాళాలతో ఆలయ ప్రాంగణం వద్దకు తీసుకుని వచ్చి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు .

బ్రహ్మ రథోత్సవం పైకి శ్రీ సిద్దేశ్వర స్వామి ఉత్సవమూర్తిని కూర్చోబెట్టి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి బ్రహ్మ రతాన్ని లాగారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బురుగులు అరటిపళ్ళు రథం పై విసిరారు. వచ్చిన భక్తాదులు మొక్కుబడులు తీర్చుకున్నారు. పోలీస్ సి.ఐ. రాజ్ కుమార్, ఎస్సై వల్లి భాష గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వెండి కవచంతో దర్శనమిస్తున్న శ్రీ సిద్దేశ్వర స్వామి



శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మరథాన్ని లాగుతున్న భక్తాదులు



శ్రీ సిద్దేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి, శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సతీమణి ఉమాదేవి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవిని



కాలిన చెట్టు. భోరున ఏడుస్తున్న రైతు

## పచ్చని తోటకు నిప్పు పెట్టిన దుండగులు

### కఠినంగా శిక్షించాలి.. డి ఎచ్ పి ఎస్ డిమాండ్

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలం రత్నగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని అలుపనపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎం శ్రీనివాస్ కు చెందిన పొలానికి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపేట్టి భారీగా నష్టం చేకూర్చారు. వారిని గుర్తించి కఠినంగా శిక్షించి బాధితుడికి ప్రభుత్వం ఆదుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం ఆర్ హనుమంతు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత నాయకుడు ఎం శ్రీనివాస్ సోదరులు ఆర్థికంగా ఎదగడం ఒర్వలేని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం మిట్టమధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రత్నగిరి గ్రామ పొలం సర్వే నెంబర్ 616-3 616-2/బి లో మొత్తం 5 ఎకరాల భూమిలో వున్న 200 మామిడి చెట్లు, 90 చింత చెట్ల తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని తోటలో వున్న దాదాపు 50 చెట్లకు పైగా అగ్గికి ఆహుతి కాగా లక్షల్లో రైతులు ఎం శ్రీనివాస్ సోదరులకు ఆస్తి నష్టం జరిగిందన్నారు.మడకశిర నియోజక వర్గంలో మునుపెన్నడూ లేని విధంగా ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాద కరమన్నారు. పోలీసువారు తక్షణం స్పందించి తోటకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని దుండగులను పట్టుకుని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని , నష్టపోయిన దళితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



సరస్వతి పూజలో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థినులు

## మాజీ ఎమ్మెల్సీ గుండుమలను కలిసిన తహసీల్దార్ చంద్రశేఖర్

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని శుక్రవారం మండల తహశీల్దారు కే ఆర్ చంద్రశేఖర్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ గిరియప్పలు కలిశారు. ఈసందర్భంగా అయనను శాలువా కప్పి హారం వేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల సర్వేయర్ ఎన్. కిరణ్ కుమార్,జయరామ్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ గుండుమల్ తిప్పేస్వామిని సన్మానించిన తహసిల్దార్ చంద్రశేఖర్

## జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

### పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాదించాలి.. రాష్ట్రస్థాయిలోనే అగళి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలి.. డిప్యూటీ డిఇఓ జాన్ రెడ్డప్ప..

అగళి,తెలుగోడు ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం,లను డిప్యూటీ డిఇఓ జాన్ రెడ్డప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎస్ సి విద్యార్థులకు మార్చిలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉతిర్ణత సాదించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు విద్యార్థులను చక్కగా చదివించి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ఎస్ఎస్సి పరీక్షలు రాసే విద్యార్థులకు,ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదివించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలోనే అగళి మండలం లోని పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని మండలవిద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు కృష్ణమూర్తి రాజు,చంద్రశేఖర్ నాయుడు, కేజీబీవీ ఎస్ఓ నాగరత్నమ్మ ఉపాధ్యాయులు షబ్బీర్, పవన్ కుమార్,భరత్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఓ జాన్ రెడ్డప్ప



కేజీబీవీలో డిప్యూటీ డిఇఓ జాన్ రెడ్డప్పను సన్మానిస్తున్న దృశ్యం

## మురళి పాఠశాలలో ఘనంగా సరస్వతీ పూజ

### విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి.. పరిపాలన అధికారి యోగనంద ..

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మురళి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పరిపాలన అధికారి యోగానంద తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో సరస్వతి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సరస్వతి లక్ష్మి గణపతి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా వేద పండితుల మంత్రోచరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ సన్నతిమ్మప్ప మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పదవ తరగతి లో వంద శాతం ఉతిర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయనకోరారు. మార్చిలో నిర్వహించే పరీక్షల్లో విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాయలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి యోగానంద్ ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో యాజమాన్యం. పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా శ్రీ గురు రాఘవేంద్ర స్వామి రథోత్సవం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** మండల పరిధి అగసనూరు గ్రామంలో వెలిసిన శ్రీ గురు రాఘవేంద్ర స్వామి బృందావనానికి తెల్లవారుజాము నుంచి పాలభిషేకం, రుద్రభిషేకం చేసి పూజారి లతో ప్రత్యేక అభిషేకం చేశారు. అదేవిధంగా దేవాలయం ప్రధాన అర్చకులు వెంకటేష్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం మహానీయమని వారన్నారు. అన్ని పార్టీ రాజకీయ శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారు రథోత్సవం నిర్వహించే సమయంలో కర్ణాటక, ఆంధ్ర, సాతనూరు, తుమ్మిగనూరు, మూగలదొడ్డి, కందుకూరు గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారి రథోత్సవాన్ని దర్శించుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకొని, కొబ్బరికాయలు కొట్టి, స్వామివారి ప్రసాదాల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారు భక్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


## పులిచింత గ్రామ కమిటీ ఎంపిక

**మంత్రాలయం (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నందవరం మండలం పులిచింత గ్రామ కమిటీని ఎంపిక చేశారు. పులిచింత గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసి కమిటీని రూపకల్పన చేసి అధికారికంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డికి అందజేశారు. ఆ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఇస్తూ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధి, పార్టీ విస్తరణలో గ్రామ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి నారాయణ రెడ్డి,తల్లరి గోపాల్, యు బుజ్జన్న, టి నరసింహులు, పి లడ్డన్న, పీ నర్సింలు, పి నర్సింగ్ రామాంజనేలు, టి వెంకటేష్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీల ప్రమాణ స్వీకారం

### మండల అభివృద్ధికి సమష్టి కృషి .. ఎంపీపీ సమ..

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 20 :** మండల పరిషత్ నూతన అధ్యక్షులుగా సుమ,వైస్ ఎంపీపీలుగా లింగరాజు, సౌమ్యలు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పార్టీ కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి వారిచేత ఎంపీడీఓ నాగేశ్వరావు శాస్త్రి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ నెల 4 న మండల పరిషత్లో నిర్వహించిన ఎన్నికల్లో సుమ ఎంపీపీగా,లింగరాజు,సౌమ్యలు వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈమెరకు శుక్రవారం వారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎంపీపీ సుమ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి,పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్పకి జడ్పీటీసీ అనంతరాజు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నాకు అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానికి ప్రజలకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆమె కోరారు. సమన్వయ కర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో దౌర్జన్యలు ఎక్కువైయన్నారు. గత ఎన్నికల్లో మండలం నుంచి 1200 మెజారిటీ వచ్చిందని మళ్లీ ఎన్నికల్లో 2500లకు పైగా మెజారిటీ వస్తుందన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు రొళ్ల ఎంపీపీ చేజారుతుందని అనుకొన్నామని కాని జడ్పీటీసీ అనంతరాజు ఎంపీటీసీ లు నాయకులు అండగా నిలబడి ఎంపీపీ చేజారకుండా చేసి ఎంపీపీ వైస్ ఎంపీపీ లు వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి దక్కిందన్నారు. జడ్పీటీసీ అనంతరాజు మాట్లాడుతూ ఎంపీపీ వైస్ ఎంపీపీ లను ఎన్నుకోవడానికి ఎంపీటీసీలు నాయకులు సమిష్టిక కృషి చేశారని తెలిపారు. పార్టీలో ఏ మాత్రం అసంతృప్తి లేదని మిగతా ముగ్గురు ఎంపీటీసీలను కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రానున్న మూడు నెలలు వేసవి కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుందని యుద్ధ ప్రతిపాదిక నా చర్యలు తీసుకొని నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. నంతరం నూతన ఎన్నికైన కార్యవర్గానికి పూలమాలలు వేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసిలు బి.అనంతరాజు భూతరాజు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి,బార్ అసోసియేషన్ అధ్యక్షులు లాయర్ అశ్వత్త నారాయణ, మాజీ జే.సి.ఎస్ నియోజకవర్గ కన్వీనర్,రంగనపల్లి నాగేంద్ర, ఎంపీటీసీలు జగదీష్, నాగరాజు, శివన్న,విశాలాక్షి, లక్ష్మి, సర్పంచులు రాజన్న, నరసింహప్ప, హరికృష్ణ, వైకాపా మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్, నాయకులు న్యాయవాది రంగనాథ్, ప్రసన్నకుమార్ ఎర్రగుంటేశ్వర, శశి కుమార్, నగేష్ రంగారెడ్డి, దొడ్డయ్య, ముద్దారెడ్డి, శ్రీనివాస్, రవిచంద్ర, సర్పంచులు ఎంపీటీసీలు వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అతిథులను న్యాయవాది రంగనాథ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న న్యాయవాది రంగనాథ్



ఎంపీపీ వైస్ ఎంపీపీలను సన్మానిస్తున్న జడ్పిటిసి అనంతరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి అనంతరాజు,ఎంపీపీ సుమ, వైస్ ఎంపీపీ లింగరాజు, నియోజకవర్గ జెసిఎస్ కన్వీనర్ నాగేంద్ర



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

## కల్లుకుంటలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకులు తాయన్న, దాసప్ప రెడ్డి, నరసింహులు, వలి తాతా జేసీబీతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తాయన్న మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి దిశగా కీలకమైన ఈ పనుల ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించబడతాయని తెలిపారు. హరిశ్చంద్రప్ప కాలనీలో వేమారెడ్డి ఇంటి నుంచి తారాపురం నరసింహులు ఇంటి వరకు ఒక సీసీ రోడ్డు, లక్ష్మన్న ఇంటి నుంచి బెల్లం బాషా ఇంటి వరకు మరో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. రెండు రోడ్లను సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొంటూ, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామ ప్రజలు ఈ పనుల ప్రారంభాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



## 23న బాపురంలో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ పంచాయతీ మజరా గ్రామం బాపురం గ్రామంలో శ్రీ గంగాదేవి జాతర సందర్భంగా ఈ నెల 23న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు హనుమంతు శుక్రవారం తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీ గంగాదేవి రథోత్సవం సందర్భంగా కాడెద్దులకు బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన కాడెద్దులకు ప్రథమ బహుమతిగా రూ. 25 వేలు కల్లుకుంట గ్రామ రైతుల తరుపున అందజేయడం జరుగుతుందన్నారు. ద్వితీయ బహుమతిగా రూ. 20 వేలు బ్యాడిగి రాఘవేంద్ర, సురేష్ రెడ్డి తరుపున, తృతీయ బహుమతిగా రూ. 15 వేలు నర్సిరెడ్డి, ఉచ్చారెడ్డి తరుపున అందజేస్తారని తెలిపారు. నాల్గవ బహుమతిగా రూ. 10 వేలు ముచ్చిగిరి గ్రామానికి చెందిన నరసప్ప తరుపున, ఐదవ బహుమతిగా రూ. 5 వేలు పూజారి అయ్యపురెడ్డి తరుపున అందజేయడం జరుగుతుందన్నారు. విజేతలకు శ్రీ గంగాదేవి ఆలయ పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 23 ఉదయం ఎనిమిది గంటలలోపు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9966025108, 9704858631, 9573756540, 9989790457 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని హనుమంతు కోరారు.

## ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలి

*ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి..*

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
ప్రతి పంచాయతీ అభివృద్ధి అధికారి సంబంధించిన గ్రామాలలో ఇంటింటి కీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని ఆదోని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ బాలకృష్ణరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారంనాడు ఆయన కోసిగి మండలము సందర్శించి, అక్కడి పన్నులు మరియు నాన్-పన్నుల వసూళ్ల శాతం,తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే కోసిగి పరిధిలోని ఇతర గ్రామపంచాయతీల వసూళ్ల పురోగతిని కూడా సమీక్షించారు. ప్రతి పంచాయతీ అభివృద్ధి అధికారి ఇంటింటి కీ వెళ్లి వసూలు పూర్తి చేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామపంచాయతీలలో పన్నులు మరియు పన్నేతర ఆదాయాల ఆన్‌లైన్ చెల్లింపును సులభతరం చేయడానికి స్వర్ణ గ్రామపంచాయతీ పోర్టల్ ను ప్రవేశపెట్టిందని. ఈ పోర్టల్ ద్వారా క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, క్యూ ఆర్ కోడ్, యూపీఐ వంటి డిజిటల్ విధానాల ద్వారా ప్రజలు సులభంగా చెల్లింపులు చేయగలుగుతున్నారన్నారు.. ఆర్థిక సంవత్సరాంతానికి ముందుగా పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్రామపంచాయతీల వద్ద గణనీయమైన బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రస్తుతం కోసిగి మండలములో 24 గ్రామపంచాయతీలలో 12771 అసెస్మెంట్స్ ఉండగా ఇప్పటి వరకు 6670 అసెస్మెంట్స్ వసూలు చేసి ఉన్నారన్నారు, ఫిబ్రవరి 25వ లోపు పూర్తిగా టాక్స్ , నాన్ టాక్స్ కలెక్షయిన్ పూర్తి చేయమని ఆదేశించారని తెలిపారు. టాక్స్‌ల రూపంలో వసూలు చేసిన నిధులతో గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ శుభ్రపరిచే పనులు, ఘన వ్యర్థాలను సంపదగా మలిచే సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయని. దీని ద్వారా గ్రామాలు శుభ్రంగా, అందంగా మారి ప్రజారోగ్యం మరియు పరిశుభ్రత మెరుగుపడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం పంచాయతీ అభివృద్ధి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్ ద్వారా పన్నులు మరియు పన్నేతర వసూళ్లు నిర్వహించగా, ప్రజలు కూడా ప్రభుత్వ విధానాలకు సానుకూలంగా స్పందిస్తూ సహకారం అందిస్తున్నారు. ఈ చర్యల ద్వారా గ్రామపంచాయతీలు ఇతర వనరులపై ఆధారపడకుండా స్వంత ఆదాయాన్ని పెంచుకొని, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిని సాధించగలుగుతున్నాయన్నారు. ఇది మహాత్మా గాంధీ గారి ఆశయమైన గ్రామ స్వరాజ్యం మరియు స్వయం సమృద్ధి గ్రామాల నిర్మాణానికి దారితీసే కీలకమైన ముందడుగుగా నిలుస్తోందని ఆయన అన్నారు.. ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీలో భాగంగా గ్రామపంచాయతీల సొంత వనరులు అభివృద్ధి చేసుకోవడంపై ట్రైనింగ్ గ్రేడ్ -4, గ్రేడ్- 5 పంచాయతీ అభివృద్ధి అధికారుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మహమ్మద్ బాషా, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరయ్య, పంచాయతీ అభివృద్ధి అధికారి రంగస్వామి , పంచాయతీ అభివృద్ధి అధికారులు , సర్పంచులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

# కొలిచే భక్తుల పాలిట కొంగు బంగారంగా శ్రీ గంగాదేవి

## రేపు వైభవంగా శ్రీ గంగాదేవి రథోత్సవం ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన బాపురంలో వెలసిన శ్రీ గంగాదేవి కొలిచే భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. బాపురం శ్రీ గంగాదేవి రథోత్సవం ఆదివారం ఆలయ పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా జరుగుతుంది. గ్రామ ప్రజల సాంప్రదాయ విశ్వాసాలకు ప్రతీకగా, భక్తుల ఆత్మీయ నమ్మకాలతో ఈ జాతర ప్రతి ఏడాది విశేష భక్తిశ్రద్ధలతో జరుగుతుందని శ్రీ గంగాదేవి యువ సంఘం నాయకులు మణేగార్ మహాదేవప్ప ధని శుక్రవారం తెలిపారు. శ్రీ సద్గురు ఉచ్చా బుడ్డప్ప తాత, శ్రీ మల్లప్ప తాతల కృపాశీర్వాదాలతో పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ శరణుల దివ్య సన్నిదానం నందు స్వస్తి శ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ మాసం పంచమీ ఆదివారం ఈ మహోత్సవాలు నిర్వహించబడనున్నట్లు వివరించారు. జాతర సందర్భంగా గ్రామం మొత్తం భక్తిరసంతో నిండిపోగా, పూజా కార్యక్రమాలు, సంప్రదాయ వేడుకలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తనున్నాయి. ఈ నెల 22న ఉదయం 8 గంటలకు శ్రీ మహాగణపతి పూజతో మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 9 గంటలకు శ్రీ గంగాపూజ,



శ్రీ క్షేత్ర బాపురం శ్రీ గంగాదేవి ఆలయం




బాపురంలో వెలసిన శ్రీ గంగాదేవి మూల విరాట్

మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ గణారాధన, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ కుంభ తీర్థం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ అమృత ఆశీర్వాదములతో రథోత్సవం, శ్రీ నంది కోలసేవ కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు భక్తులలో ఆధ్యాత్మికోత్సాహాన్ని నింపుతూ, గ్రామ సాంప్రదాయాల మహిమాన్వితతను ప్రతిబింబిస్తాయి. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు శ్రీ గంగాదేవికి ఆకుపూజ నిర్వహించ నుండగా, సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా గౌరిదేవి కళ్యాణ మహోత్సవం పరమశివునితో ఘనంగా నిర్వహిస్తారు. అదనంగా రంగాట తదితర సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పవిత్ర మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ గంగాదేవి ఆశీర్వాదం పొందాలని, జాతర వైభవాన్ని ఆస్వాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తుల విశ్వాసం కలిసిన ఈ జాతర ఆధ్యాత్మిక సౌభాగ్యానికి నిదర్శనంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.



గంగాదేవి ఆలయ పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ అవ్వ



శ్రీ క్షేత్ర బాపురం గంగాదేవి ఆలయ గోపురాలను రంగులో తీర్చిదిద్ధిన దృశ్యం

## హెచ్ మురవణిలో సీసీ రోడ్లు నిర్మాణం పనులు ప్రారంభం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్ మురవణి గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ సొంటెన్న, బూత్ ఇన్ చార్జ్ దుమ్మల శివ, దస్తగిరి, నరసింహుడు, చెన్నకేశవ శుక్రవారం సీసీ రోడ్లు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ సొంటెన్న, బూత్ ఇన్ చార్జ్ దుమ్మల శివ మాట్లాడుతూ గ్రామంలోని మాల తిక్కయ్య ఇంటి దగ్గర నుంచి నరసప్ప కట్ట వరకు రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. అలాగే శ్రీ సుంకలమ్మ గుడి దగ్గర నుంచి గంగమ్మ కట్ట వరకు రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నయ్య, టీడీపీ నాయకులు భీమేష్, నరసయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ మురవణి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు



హెచ్ మురవణి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు



వీరారెడ్డి నూతన గృహప్రవేశంలో పాల్గొన్న సురేష్ నాయుడు, సతీష్ నాయుడు టిడిపి నాయకులు

## శుభకార్యాల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

**కౌతాళం (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
కౌతాళం మండలంలో జరిగిన పలు శుభకార్యాల్లో ముఖ్య అతిథిగా చూడి ఉల్లిగయ్య, ఆయన కుమారులు సతీష్ నాయుడు, సురేష్ నాయుడు పాల్గొన్నారు. హాల్వి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. వగరూరు గ్రామ తెదేపా నాయకులు వీరారెడ్డి నూతన గృహ ప్రవేశం, మరళి గ్రామం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం , కౌతాళం మండలంలో మెలిగనూరు గ్రామం శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు., మంత్రాలయంలో జరిగిన తెదేపా కుటుంబ సభ్యుల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన జీవితంలోకి అడుగు పెడుతున్న వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు వల్లూరు అడివప్ప గౌడ్, రామలింగ,లక్కే గోవిందు, కురువ నాగేష్, ఈడీగా హనుమంతు, హరివిలి బసవ,శివ చూడి, నాగరాజు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హాల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పాల్గొన్న చూడి ఉల్లిగయ్య



వివాహ వేడుకల్లో పాల్గొన్న సురేష్ నాయుడు, సతీష్ నాయుడు టిడిపి నాయకులు



## ఏజిపీగా రశీదుల్లా

*ఎమ్మెల్యే బీవీకి అభివందనలు...*

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ అధ్యక్షులు రసీదుల్లాని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమించారు. ఈ మేరకు జిల్లా మెజిస్ట్రేట్ , కలెక్టర్, జిల్లా కోర్టు, ఎమ్మినూరు మున్సిఫ్ కోర్టుకి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయి. తమ కుటుంబం పై నమ్మకం ఉంచి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రసీదుల్లాకు అవకాశం కల్పించిన శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వరరెడ్డికి రుణపడి ఉంటామని 23వ వార్డు ఇంచార్జ్ ఎస్ .మహబూబ్ బాషా, ఎఫ్.పి షాప్ డీలర్ అబ్బాస్, 35 షాప్ డీలర్ షహనాజ్ బేగం, సోమల గూడూర్ మైనార్టీ విభాగంయువ నాయకులు అను మాలిక్, అహమ్మద్ , మాబు సాబ్ బడేవి, వెల్ఫేర్ సెక్రెటరీ సైనస్ బేగం, సమ్రిన్ ఎంబిబిఎస్ ,అజారుద్దీన్, రాస్తా షమీనా , కైఫ్ బీటెక్, రాస్తా సుభాన్, రస్తమాభి, ముస్విరా, షౌకత్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఈ నెలాఖరులోగా రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోండి

*వ్యవసాయ అధికారి వరప్రసాద్..*

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
కేంద్ర రాష్ట్ర ప్రయోజిత పథకాల అమలులో కీలకమైన 11 అంకెల యూనిక్ ఐడి పొందేందుకు ఈ నెలాఖరులోగా ప్రతి రైతూ రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలని కోసిగి మండల వ్యవసాయ అధికారి ఎం.వరప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోసిగి మండలంలో మొత్తం 11,238 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగలా వారిలో 9308 మంది లబ్ధిదారులు మాత్రమే రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారన్నారు. మిగతా 1930 మంది రైతులు ఇంకా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, పంటల బీమా పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకునేందుకు రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని కోరారు. లేదా వెబ్సైట్ ద్వారా కూడా రైతులే స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ పథకాలకు కేంద్ర బిందువుగా ఉన్నటువంటి పంట నమోదు కొరకు రైతులు సహకరించాలని, ఇప్పటిదాకా 84శాతం పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని , ఈ రబీ సీజన్ నుండి ఏపీ ఏఐ ఎం ఎస్ 2.0 అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా రైతులు స్వతాహగా పంట నమోదు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరప్రసాద్ తెలిపారు.



స్థలం చదును చేయిస్తున్న నాయకులు


## అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం చదును

*టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరికోట సాలెం దావీదు..*

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 20 :**
ఎమ్మిగనూరులో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థలాన్ని చదునుచేసే పనులు శుక్రవారం చేపట్టారు. 2014లో జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు శాసనసభ్యులుగా ఉన్న సమయంలో దళితులు అభివృద్ధి , సంక్షేమం కోసం అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎకరా 60 సెంట్లు స్థలం మంజూరు చేయించారు. అ స్థలంలో త్వరలో అంబేద్కర్ భవన నిర్మాణానికి పునాది వేయబోతున్నారు. దీంతో అ స్థలాన్ని చదునుచేసే పనులు శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దావీదు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరికోట శాలెం. సహకార సంఘం డైరెక్టర్ ఆరెకంటి దేవదాసు, ముగితి నరసయ్య, కనకవీడు ఆమోసు, కనకవిడు రాజు నరసింహులు. మాజీ కౌన్సిలర్. ఎం. సుందరాజు. నందవరం ప్రకాష్. హలహార్వి ప్రభుదాస్. మణి. మాజీ సర్పంచి దాసు. పార్లపల్లి రాజేష్. దళిత నాయకులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ముంబైలో ఉండి.. చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా

నటుడు ప్రభాస్ ఫుడ్ లవర్...ఆయన వెరైటీ ఫుడ్ ఇష్టపడతారు. అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి మీరు మాములు వాళ్లు కాదండీ' అంటూ చేసిన కామెంట్స్‌ను ప్రభాస్ గుర్తుచేసుకున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని అగ్రనటుడు ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు. నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని అంటూ 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకు న్నానన్నారు. పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను అన్నారు. మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.





# కామెడీ ట్రాక్‌లో హే బలవంత్..

ప్రేక్షకులను అలరిస్తే చాలు పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా చిన్న సినిమాలు కూడా థియేటర్లలో రాణిస్తాయి. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాలే దానికి నిదర్శనం. ఆ సినిమాలను విడుదల చేసిన బన్నీ వాస్, వంశీ నందిపాటి మరోసారి కలిసి సుహాస్ నటించిన 'హే బల్‌వంత్' చిత్రాన్ని తీసుకొచ్చారు. సీక్రెట్ బిజినెస్ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్స్ ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. కృష్ణ (సుహాస్) చిన్నప్పటి నుంచే తండ్రి బల్‌వంత్ (నరేష్) చేస్తున్న బిజినెస్ చేయాలని నిర్ణయించుకుంటాడు. కానీ ఆ వ్యాపారం ఏమిటో అతనికి తెలియదు. దాన్ని దాచేందుకు బలవంత్ అతడిని బోర్డింగ్ స్కూల్‌లో పెడతాడు. చదువు పూర్తయ్యాక ఇంటికి వచ్చిన కృష్ణ, అనారోగ్యానికి గురైన తండ్రి స్థానంలో బిజినెస్ బాధ్యతలు తీసుకోవడానికి ఆఫీస్‌కు వెళ్తాడు. ఆ వ్యాపారాన్ని కళ్లారా చూసిన అతనికి పెద్ద షాక్ ఎదురవుతుంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏమిటి? ఆ వ్యాపారం అతని ప్రేమ, తండ్రితో ఉన్న బంధాలపై ఎలాంటి ప్రభావం చూపిందనేదే కథ.నవ్విస్తూనే మనసులను హత్తుకునే కథ చెప్పాలనే ప్రయత్నం చేశాడు దర్శకుడు గోపి అచ్చర. ఈ ప్రయత్నం చాలా వరకు సక్సెస్ అయ్యింది. ఫస్ట్ హాఫ్‌లో సీక్రెట్ బిజినెస్ కామెడీ బాగా వర్క్ అవుతుంది. కృష్ణ బిజినెస్ ఐడియాలు, లవ్ ట్రాక్ సరదాగా సాగుతాయి. ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ప్రకృతి వైద్యం ఎపిసోడ్ మంచి నవ్వులు పంచుతుంది. సుహాస్, సుదర్శన్, వెన్నెల కిశోర్ కలిసి చేసిన కామెడీ ట్రాక్ హైలెట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ కథపై ఆసక్తిని మరింత పెంచుతుంది. సీక్రెట్ బిజినెస్ నేపథ్యంతో సాగిన కథ సెకండ్ హాఫ్‌లో కిడ్నాప్ డ్రామా వైపు మళ్లుతుంది.÷న్నెల కిశోర్ లవ్ ట్రాక్, అజయ్ ఘోష్ ఇంట్లో జరిగే సన్నివేశాలు వినోదాన్ని అందిస్తాయి. డెడ్ బాడీ చుట్టూ నడిచే ఎపిసోడ్ ఇంకా బెటర్ గా వుండాల్సింది. చివరి ఇరవై నిమిషాల్లో తండ్రి-కొడుకుల భావోద్వేగాన్ని బలంగా చూపించాలనే ప్రయత్నం ఆకట్టుకునేలా ఉంటుంది. సుహాస్ తనకు సూటయ్యే పాత్రలో మరోసారి మెప్పించాడు. కామెడీతో పాటు ఎమోషన్ సీన్స్‌లో కూడా ఆకట్టుకున్నాడు. శివానీ నాగారం మిత్ర పాత్రలో ఉత్సాహంగా
కనిపించింది. నరేష్‌కు ఇచ్చిన ఎలివేషన్ సన్నివేశాలు వినోదంగా ఉంటాయి. సుదర్శన్ కామెడీ టైమింగ్ బాగా వర్క్ అయ్యింది. వెన్నెల కిశోర్, హర్ష వర్ధన్, అజయ్ ఘోష్ పాత్రలు కథకు వినోదాన్ని జోడించాయి. వివేక్ సాగర్ సంగీతంలో పాటలు అంతగా గుర్తుండకపోయినా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని సన్నివేశాలకు బలం ఇచ్చింది. సినిమాటోగ్రఫీ డీసెంట్‌గా ఉంది. ఎడిటింగ్ పదునుగానే వుంది. కథకు తగ్గ నిర్మాణ విలువలు కనిపించాయి.




# 27న వస్తోన్న సన్ ఆఫ్...




సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ నిర్మించిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీష్ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో గురువారం 'ఊసులాడే..' అనే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రచించిన ఈ గీతానికి రిషి ఎం సంగీతాన్నందించారు. ఆదిత్య, సమీర భరద్వాజ్ ఆలపించారు. ప్రేమబంధంలోని మధురానుభూతులకు అద్దం పట్టే గీతమిదని దర్శకుడు తెలిపారు. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ కథలో చక్కటి సందేశం ఉంటుందని హీరో పేర్కొన్నారు. మీరారాజ్, వినోద్‌కుమార్, వాసు ఇంటూరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రిషి ఎం, రచన-దర్శకత్వం: బత్తుల సతీష్.

# ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్



గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ - డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.